క్లుప్తంగా

సాగు యంత్రాలకు దరఖాస్తు చేసుకోండి

యాచారం: రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన మొండిగౌరెల్లి, గడ్డమల్లయ్యగూడ, చౌదర్‌పల్లి గ్రామాల రైతులు పథకాల కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి రవినాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. కూరగాయలు, ఆకుకూరల సాగును మరింత పెంచే విధంగా కావాల్సిన డ్రిప్, స్ప్రింక్లర్లు, పీవీసీ పైపులు, పట్టుపురుగుల పెంపకం, సోలార్ ఫెన్సింగ్, వ్యవసాయ యంత్రాలు, బ్యాటరీలు, పవర్ పంపులు, కూరగాయల విత్తనాల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు ఆధారంగానే అర్హులను గుర్తిస్తామని పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మంచాల: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని ఆ పార్టీ నాయకులు కొంగర విష్ణు వర్ధన్‌రెడ్డి, గుండమోని జయమ్మ అన్నారు. ఎస్సీ వర్గీకరణ, బీసీ రిజర్వేషన్ బిల్లుల ఆమోదం నేపథ్యంలో శుక్రవారం యువజన కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. నిరుద్యోగ యువతకు యువ వికాసం పథకం తీసుకురావడం శుభ పరిణామమన్నారు. రాష్ట్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్, నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చేస్తున్న కృషి మరువ లేనిదని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాంరెడ్డి, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు సికిందర్‌రెడ్డి, నాయకులు ఎద్మా నరేందర్‌రెడ్డి, రమాకాంత్‌రెడ్డి, సదానందం, సత్తయ్య, శ్రీనివాస్, ఏర్పుల రాజు, చేతాళ్ల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం వద్దు

ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి



నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

యాచారం: ఈజీఎస్ నర్సరీల్లోని మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం వద్దని ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి సిబ్బందికి సూచించారు. మండల పరిధిలోని నందివనపర్తి గ్రామంలోని ఈజీఎస్ నర్సరీని శుక్రవారం ఆయన సందర్శించి మొక్కల పెంపకాన్ని పరిశీలించారు. ఎండల తీవ్రత దృష్ట్యా రోజు విడిచి రోజు మొక్కలను నీరు అందించాలని చెప్పారు. పెంచే ప్రతి మొక్క బతికే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మొక్కల పెంపకంలో ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా.. బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఈర్లపల్లి శ్రీనువాస్ ఉన్నారు.

ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం

నిందితులపై చర్యలకు కాంగ్రెస్ నాయకుల డిమాండ్



సీఐ శివ ప్రసాద్‌కు ఫిర్యాదు అందజేస్తున్న యువజన నాయకులు

కడ్తాల్: సామాజిక మాధ్యమ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తున్నవారిపై తగిన చర్యలు తీసుకోవాలని యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్యామ రాజేశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం యువజన నాయకులతో కలిసి సీఐ శివ ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ ప్రతిష్టతను దెబ్బతీసేలా నీచమైన భాషను వాడుతూ విష ప్రచారం చేస్తున్న 'డిగ్ టీవీ పేరడి చానల్' నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు రవికాంత్‌గౌడ్, నాయకులు షాబుద్దీన్, రవి, భానుకిరణ్, శ్రీకాంత్, రమేశ్, ప్రవీణ్‌గౌడ్, మల్లేశ్, తులసీరాం, చరణ్, రామకృష్ణ, మహేశ్, నరేశ్ ఉన్నారు.

చరిత్రకు సాక్ష్యం.. పాలకుల నిర్లక్ష్యం

ప్రభుత్వాలు మారాయి. పాలకులు మారుతున్నారు. కానీ రాచకొండ తలరాత మారడం లేదు. రాష్ట్ర రాజధానికి సమీపానే ఉన్నా.. ఎలాంటి ఆదరణకు నోచుకోవడం లేదు. పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని స్వయంగా ముఖ్యమంత్రులు ఇచ్చిన హామీలు.. నీటిమీద రాతలుగానే మారాయి.



రాచకొండ ప్రాంతం

ఆదరణకు నోచుకోని రాచకొండ కోట

- గుర్తింపు తెస్తామన్న సీఎంల హామీలు బుట్ట దాఖలు
- వెలవెలబోతున్న కాకతీయుల రాజ్యం
- పురాతన ఆలయాలకు భక్తుల తాకిడి
- నిత్య ధూప దీప నైవేద్యాలు అందుకుంటున్న శైవం

మంచాల: మండల పరిధి రాచకొండకు వందల ఏళ్లనాటి చరిత్ర ఉంది. 13వ శతాబ్దంలో కాకతీయుల కాలంలో సామంత రాజులైన రేచర్ల పద్మ నాయకులు క్రీస్తు శకం 1325 నుంచి 1475 వరకు పాలించారు. సుమారు 152 సంవత్సరాలు స్వతంత్ర రాజ్యానికి రాచకొండ ప్రాంతం రాజధానికిగా వెలిసింది. ఇక్కడ రత్నాలు, పగడాలు, వజ్ర వైడుర్యాలు రాశులగా పోసి, విక్రయించే వారని చరిత్ర చెబుతోంది. నాడు ఎంతో సంపన్న రాజ్యంగా పేరుగాంచిన పట్టణం.. నేడు వెలవలబోతోంది. నాటి శత్రుదుర్భేద్యంగా రాతి కట్టడాలు, రాతితో ఎత్తైన ప్రహరిలు, అపురూప శిల్ప కళలతో నిర్మించిన ఆలయాలు, గోపురాలు, అద్భుత రాతి కట్టడాలు ఎన్నో ఉన్నాయి. వీటిల్లో కొన్ని శిథిలావస్థకు చేరినప్పటికీ.. చాలా మటుకు చరిత్రకు సాక్ష్యంగా సజీవంగా ఉన్నాయి. రాచరికపు వాసనలు వెదజల్లుతున్నాయి.

వేలాది ఎకరాల్లో..


రంగారెడ్డి జిల్లా సరిహద్దు ప్రాంతం మంచాల మండలం రాచకొండను అనుసరించి.. సుమారు 34 వేల ఎకరాలకు పైగా గుట్టలు విస్తరించి ఉన్నాయి. 17,438 ఎకరాలు వరకు అటవీ భూమి ఉండగా, మరో 16,837.26 ఎకరాలు సాగుకు యోగ్యమైన భూములు ఉన్నాయి. 13,633 ఎకరాలను యాదాద్రి జిల్లా(నల్గొండ)కు సంబంధించిన గ్రామాలకు చెందిన రైతులు సాగు చేయగా, 3,204 ఎకరాలను మంచాల, ఇబ్రహీంపట్నం మండలాల వారు సాగు చేస్తున్నారు. ఈ ప్రాంతాన్ని అనుసరించి మంచాల మండలంలో 7,500 ఎకరాలు, ఇబ్రహీంపట్నం 6వేల 250 ఎకరాలు అటవీ భూములు ఉన్నాయి. నగరీకరణ అభివృద్ధితో పాటు, గుట్టల ప్రాంతానికి మంచి డిమాండ్ పెరిగింది. దీంతో భూముల ధరలకు రెక్కలు వచ్చాయి.

గుట్టల్లో వెలసిన ఆలయాలు

రాచకొండ గుట్టల్లోనే చరిత్రాత్మకమైన రామాలయం, సరళమైసమ్మ, శివాలయం దేవాలయాలు ఉన్నాయి. గాలీబ్ హజరత్ దర్గ, రాచకొండ(రాతి) కోట, శ్రీ లక్ష్మీనర్సింహస్వామి ఆలయం, అందమైన రాతి కట్టడాలు ఉన్నాయి. ఏటా శివరాత్రి ఉత్సవాలు శివాలయంలో ఘనంగా జరుగుతుంటాయి. అప్పుడే దర్గ ఉత్సవాలు నిర్వహిస్తారు. ఏప్రిల్‌లో శ్రీరామ నవమి రోజున సీతారాముల కల్యాణం జరుగుతుంది. ఉత్సవాలు, జాతర తదితర కార్యక్రమాల నేపథ్యంలో భక్తుల రాకతో రాచకొండ కళకళలాడుతుంటుంది. ఆది, గురు వారాల్లో భక్తుల రాకతో అటవీ ప్రాంతంలో సందడి నెలకొంటుంది.

కొత్త పాలసీలో ప్రస్తావన నిల్

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పర్యటక ప్రాంతాల అభివృద్ధికి కొత్త పాలసీ తెచ్చింది. అందులో తొలిదశగా 27 పర్యటక కేంద్రాలను గుర్తించింది. వాటిలో ఆధ్యాత్మిక, వారసత్వ, ఎకో- వెల్‌నెస్, హస్తకళలు, జలపాతాలు, బుద్ధిస్ట్ ప్రాంతాలు ఉన్నాయి. రాచకొండలో అలనాటి అద్భుత కట్టడాలు, జల పాతాలు, పచ్చని ప్రకృతి అందాలు ఎన్నో ఉన్నాయి. అయినా రాచకొండను గుర్తించక పోవడంతో జిల్లా వాసులు తీవ్ర అసంతృప్తిని వ్యక్తంచేస్తున్నారు.



రాచకొండ కోట పైకి వెళ్లే ప్రధాన ద్వారం

చిత్రపరిశ్రమకు కేసీఆర్ హామీ

రాచకొండ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని పలువురు ముఖ్యమంత్రులు హామీ ఇచ్చినప్పటికీ.. అవి అమలు కాలేదు. కనీసం పర్యటక ప్రాంతంగా గుర్తించక పోవడం ఇక్కడి ప్రజలను విస్మయానికి గురిచేస్తోంది. 2014 డిసెంబర్ 14న నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ నగరం నుంచి హెలికాప్టర్ ద్వారా రాచకొండ కోటకు వచ్చారు. రంగారెడ్డి అప్పటి కలెక్టర్ శ్రీధర్, నల్గొండ కలెక్టర్ చిరంజీవులతో పరిసరాలను పరిశీలించారు. పర్యాటక కేంద్రంగా విరాజిల్లే విధంగా చిత్ర పరిశ్రమను ఏర్పాటు చేస్తామని హామీనిచ్చారు. వెనుకబాటుకు గురైన ఈ ప్రాంత ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. కానీ వాటిల్లో ఏ ఒక్కటీ ఆచరణలో పెట్టలేదు.



కోట ముఖ ద్వారం

రాచకొండలో ఊటి.. రేవంత్ హామీ

గతేడాది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నోట 'రాచకొండ' ప్రస్తావన రావడంతో హాట్ టాఫిక్‌గా మారింది. ఈ ప్రాంత ప్రజలందరినీ మమేకం చేసి, కొత్త నగరాన్ని నిర్మిస్తే.. ప్రకృతి అందాల మధ్య ఊటీని తలపిస్తుందని పేర్కొన్నారు. ఇలా రాచకొండ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని స్వయంగా ముఖ్యమంత్రులు ఇచ్చిన హామీలే బుట్ట దాఖలయ్యాయని ప్రాంత ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా దృష్టి సారించాలని కోరుతున్నారు.

ప్రత్యేక చరిత్ర



రాచకొండ గుట్టలకు రాష్ట్రంలోనే ప్రత్యేక చరిత్ర ఉంది. ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి అన్ని రకాలుగా అభివృద్ధి చేయాలి. పురాతన దేవాలయాలు, అద్భుత కట్టాలు, జలపాతాలు ఎన్నో ఉన్నాయి. పర్యటకంగా అభివృద్ధిలోకి తేవాలి.

– గోగిరెడ్డి లచ్చిరెడ్డి

టూరిజం హబ్‌గా..



రాచకొండను గుర్తిస్తే.. ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుంది. ఆ దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. టూరిజం హబ్‌గా మార్చి, నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలి.

– గోరె వీరేష్ గౌడ్, తిప్పాయిగూడ

తొలి రోజు 'పది' పరీక్షలు ప్రశాంతం

పట్నంలో ఎనిమిది, మంచాలలో ఒకరు, యాచారంలో ఇద్దరు విద్యార్థుల గైర్హాజరు

ఇబ్రహీంపట్నం/ఆమనగల్లు: పదో తరగతి వార్షిక పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. తొలి రోజు ప్రశాంతంగా ముగిశాయి. విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో పరీక్ష కేంద్రాల వద్ద సందడి నెలకొంది. ఇబ్రహీంపట్నం మండలంలో 2,375 మంది పరీక్ష రాయాల్సి ఉండగా.. 8 మంది గైర్హాజరయ్యారు. పట్నంలోని టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్, గురుకుల విద్యాపీఠ్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జెడ్పీహెచ్ఎస్(బాలికలు), శాస్త్ర, టీఆర్ఆర్, ప్రియాంక, ఇండియన్ పబ్లిక్ స్కూల్, కృష్ణవేణి టాలెంట్ స్కూల్, జెడ్పీహెచ్ఎస్ శేరిగూడ పరీక్ష కేంద్రాల వద్ద పోలీసులు 144 సెక్షన్ విధించి, బందోబస్తును ఏర్పాటు చేశారు.

ఆమనగల్లులో..

పట్టణంలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. బాలుర పాఠశాలలో 260, బాలికల పాఠశాలలో 277 మంది పరీక్ష రాశారు. ఎవరూ గైర్హాజరు కాలేదు. పరీక్ష కేంద్రాలను ఎంఈఓ పాండు పరిశీలించారు. ఓ విద్యార్థి చేతికి గాయంతో రాగా.. సూపరింటెండెంట్ అనుమతితో 9వ తరగతి విద్యార్థి సహాయకుడిగా పరీక్ష రాశాడు. ఎస్ఐ వెంకటేశ్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

మంచాలలో..

మంచాల: మొదటి రోజు పది పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మండల కేంద్రంలోని మూడు పరీక్ష కేంద్రాల్లో 451 మంది విద్యార్థులకు 450 మంది పరీక్ష రాయగా.. ఒకరు గైర్హాజరయ్యారు. మంచాల బాలికల పాఠశాలలో 158 మంది, కేజీబీవీ మంచాలలో 159 మంది, బాలుర ఉన్నత పాఠశాలలో 134 మందికి 133 మంది పరీక్ష రాశారు.

యాచారంలో..

యాచారం: యాచారం మండలంలో ఐదు పరీక్ష కేంద్రాల్లో 896 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా, మొదటి రోజు 894 మంది పరీక్ష రాశారని ఎంఈఓ పాండు రంగారెడ్డి తెలిపారు. నందివనపర్తి, యాచారం, గునుగల్ ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. నందివనపర్తి సెంటర్‌ను ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి సందర్శించారు.

మాడ్గులలో..

మాడ్గుల: మాడ్గుల మండలంలో ఏర్పాటు చేసిన మూడు పరీక్ష కేంద్రాల్లో 452 మంది పరీక్ష రాశారు. మొదటి రోజు విద్యార్థులు సకాలంలో కేంద్రాలకు చేరుకున్నారు. బాలబాలికలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అధికారులు పర్యవేక్షించారు.

కడ్తాల్‌లో..

కడ్తాల్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఎ సెంటర్‌లో 277 మంది, బీ సెంటర్‌లో 147 మంది, ముద్వీన్ ఉన్నత పాఠశాల కేంద్రంలో 102 మంది పరీక్ష రాశారు. మండలంలో మొత్తం 526 మందికి 526 మంది విద్యార్థులు హాజరయ్యారని ఆయా పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు చందులాల్, ఝాన్సీలక్ష్మి, కృష్ణమూర్తి తెలిపారు. డిపార్ట్‌మెంట్ అధికారులు విష్ణుమూర్తి, వెంకటరమణరెడ్డి, రాధాకృష్ణారెడ్డిలు పర్యవేక్షించారు. ఎస్ఐ వరప్రసాద్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.



ఇబ్రహీంపట్నం: పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు



ఆమనగల్లు: చేతికి గాయంతో హాజరైన విద్యార్థితో మాట్లాడుతున్న ఎంఈఓ పాండు



కడ్తాల్: హాల్‌టికెట్ నంబర్లు చూసుకుంటున్న విద్యార్థులు



మంచాల: నందివనపర్తి పాఠశాల కేంద్రం వద్ద విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది



మాడ్గుల: హాల్ టికెట్లను పరిశీలిస్తున్న ఎంఈఓ సర్దార్ నాయక్

కష్టమైనా.. ఇష్టంగా చదివించండి



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఏసీపీ కేపీవీ రాజు

- పిల్లలు చెడు వ్యసనాలకు బానిసకాకుండా పెద్దలు గమనించాలి
- ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు

యాచారం: ఎంత కష్టమైనా ఇష్టంగా తమ పిల్లలను తల్లితండ్రులు ఉన్నతంగా చదివించుకోవాలని, వారు ఉద్యోగాలు సాధిస్తే కుటుంబ ఆర్థిక ప్రగతి సాధ్యమవుతుందని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు అన్నారు. యాచారం పీఎస్ పరిధి నస్దిక్‌సింగారం గ్రామంలో శుక్రవారం ఆర్థిక నేరాలు, డ్రగ్స్, గంజాయి, కొత్త వ్యక్తుల సంచారం, చోరీలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. పిల్లలు, యువత చేడు వ్యసనాలకు గురి కాకుండా పెద్దలు గమనించాలని సూచించారు. డ్రగ్స్, గంజాయి అమ్మకాలపై నిఘా పెట్టాలని, కొత్త వ్యక్తుల సంచారం, చోరీలపై అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. శుభకార్యాలు, బంధువుల ఇళ్లకు వెళ్లేటప్పుడు ఇంట్లో విలువైన సామగ్రి, నగలు, డబ్బును ఉంచరాదని పేర్కొన్నారు. ప్రతి ఇంటి వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో సీఐ నందీశ్వర్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి



ఇఫ్తార్ విందులో వంశీచంద్‌రెడ్డి, నాయకులు, ముస్లింలు

కడ్తాల్: మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందులు అని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి మండల కేంద్రంలోని ఓ గార్డెన్‌లో మండల పరిషత్ మాజీ కోఆప్షన్ సభ్యుడు జహంగీర్ బాబా ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వంశీచంద్‌రెడ్డి మాట్లాడుతూ.. రంజాన్ మాసంలో ఉపవాస దీక్షను ఆచరించే ముస్లింలకు ఇచ్చే ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని పేర్కొన్నారు. అంతకు ముందు మజీద్ ఇమామ్ మౌలానా జహీరుద్దీన్ ఆధ్వర్యంలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సీసెల్ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు జగన్, యువజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాఘవేందర్, నాయకులు బీక్యానాయక్, మల్లేశ్‌గౌడ్, సత్యం, అజీమ్, జహంగీర్‌అలీ, రాంచందర్, మజీద్ కమిటీల అధ్యక్షుడు రవూఫ్, హైమాద్ జాని, ఉపాధ్యక్షుడు జావీద్ తదితరులు ఉన్నారు.

పోస్టల్ బీమాను సద్వినియోగం చేసుకోండి

ఆమనగల్లు: పోస్టాఫీసు ద్వారా అందిస్తున్న బీమా సౌకర్యాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వనపర్తి పోస్టల్ సూపరింటెండెంట్ ఎం.భూమన్న కోరారు. పట్టణంలోని బస్టాండ్ వద్ద శుక్రవారం శాఖ ఆధ్వర్యంలో పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యక్తిగత ప్రమాద బీమా పథకం కింద సంవత్సరానికి రూ.565 చెల్లిస్తే, రూ.పది లక్షల బీమా సౌకర్యం, రూ.345 చెల్లిస్తే రూ.5 లక్షల బీమా సౌకర్యం ఉంటుందని వివరించారు. బీమాకు 18 నుంచి 65 సంవత్సరాల వయసు గల వారు అర్హులని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ అకౌంట్ మేనేజర్లు రాజశేఖర్, మీర్జా మొజం తదితరులు పాల్గొన్నారు.

నిరాశ మిగిల్చిన బడ్జెట్

మంచాల: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన వార్షిక బడ్జెట్ ఉద్యోగ, ఉపాధ్యాయులకు తీవ్ర నిరాశ మిగిల్చిందని తపస్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పూజారి రమేష్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. విద్య రంగానికి కనీసం పది శాతం కూడా నిధులు కేటాయించక పోవడం చాలా బాధకరమన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎంతో కాలంగా పెండింగ్ బిల్లులు, డీఏలు, పీఆర్‌సీ మంజూరు కోసం ఎదురు చూస్తున్నారని, అయినా సరైన నిధులు కేటాయించలేదని పేర్కొన్నారు. ఎన్నికల హామీల నేపథ్యంలో ప్రభుత్వం.. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

మత్స్యశాఖకు మొండి చేయి

సంఘం మండల అధ్యక్షుడు సత్తయ్య ముదిరాజ్

మంచాల: రాష్ట్ర బడ్జెట్‌లో ప్రభుత్వం మత్స్యశాఖకు మొండి చేయి చూపించిందని ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు జిల్లామోని సత్తయ్య ముదిరాజ్ విమర్శించారు. ముదిరాజ్‌లను బీసీ'డీ'నుంచి బీసీ'ఏ'కు మారుస్తామని హామీ ఇచ్చి విస్మరించిందని ఆరోపించారు. సంఘం రాష్ట్ర కమిటీ ఇచ్చిన చలో అసెంబ్లీ ముట్టడి నేపథ్యంలో ముదిరాజ్ నాయకులను పోలీసులు శుక్రవారం తెల్లవారు జామున మందుస్తు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం మత్స్యశాఖకు రూ.100 కోట్లు ప్రకటిస్తే.. ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన ఒక్క హామీని అమలు చేయలేదని పేర్కొన్నారు. అరెస్టు చేస్తే ఉద్యమాలు ఆగవని, సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు చింతకింది చక్రపాణి, నీళ్ల కృష్ణ, మల్లేశ్, సతీష్ చంద్ర, యాదయ్య పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా శేఖర్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: బీజేపీ ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షుడిగా రాయపోల్ గ్రామానికి చెందిన గోదాల శేఖర్‌రెడ్డిని నియమించారు. ఈ మేరకు శుక్రవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. తనపై ఎంతో నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించారని, నమ్మకాన్ని వమ్ముచేయకుండా పార్టీ పటిష్టతకు కృషిచేస్తానన్నారు. ఈ పదవినిచ్చిన నాయకత్వానికి, సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

'దారి' చూపండి సారూ..



తహసీల్దార్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేసిన మాదిగ జేఏసీ నాయకులు

మంచాల: దళితులకు ఇచ్చిన బాండెడ్ లేబర్ భూములకు వెళ్లేందుకు దారి చూపాలని మాదిగ జేఏసీ నాయకులు కోరారు. ఈ మేరకు వారు శుక్రవారం తహసీల్దార్ ఎంవీ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జేఏసీ నియోజకవర్గ అధ్యక్షుడు భాస్కర్ మాట్లాడుతూ.. 40 ఏళ్ల క్రితం ప్రభుత్వం, దళితులకు బాండెడ్ లేబర్ కింద.. లింగంపల్లి 56,57,58,60,61 సర్వే నంబర్లలో 11 ఎకరాల భూమిని ఇచ్చిందని తెలిపారు. నాటి నుంచి ఆ భూములను దళితులు సాగు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. నేడు ఆ భూముల్లోకి దళితులు వెళ్లకుండా కొందరు అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. వాస్తవాలను పరిశీలించి, బాధితులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు జంగయ్య, భిక్షపతి, రాములు, పరమేష్, సంజీవ, బుగ్గయ్య, యాదయ్య, శ్రీను, సూర్యం పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని గాంధీ విగ్రహం వద్ద.. జూలూరు రాఘవేందర్ జ్ఞాపకార్థంగా రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో శనివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేయనున్నామని నిర్వాహకులు తెలిపారు. శిబిరంలో ఆరోగ్యవంతమైన యువతీ, యువకులు రక్తదానం చేయాలని వారు కోరారు.